ఎన్ని రోజులు ఈ అవస్థలు?

- పంచాయతీల భవన నిర్మాణంలో జాప్యం
- నిధులు మంజూరైనా మొదలు కాని పనులు
- పాత భవనాలు కూల్చేస్తే కొత్త నిర్మాణాలు
- చాలా గ్రామాల్లో స్థల కొరత
- బిల్లుల చెల్లింపులపై అనుమానం



అద్దె గదుల్లో వెంకట్రావుపల్లి జీపీ విధులు


చిన్న గదిలో రత్నంపేట గ్రామపంచాయతీ


శిథిలావస్థలో దుండ్రపల్లి జీపీ భవనం

బోయినపల్లి: గ్రామాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా పంచాయితీ భవనాలు లేక ఇరుకైన గదులతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 23 గ్రామపంచాయితీలో . చాలా గ్రామాల్లో గ్రామసభలు, పాలకవర్గ సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలభావం ఉండేది. గ్రామాల్లో చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన పంచాయతీ భవనాల్లో అరకొర వసతుల మధ్య నెట్టుకొస్తున్నారు. అయితే మండలంలో 11 గ్రామపంచాయతీలకు నూతన భవన నిర్మాణాలకు రూ.20 లక్షల చొప్పున ఈజీఎస్ కింద నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరైనా నిర్మాణాలు ప్రారంభించలేదు.

పాత భవనాలు కూల్చేస్తేనే కొత్త నిర్మాణాలు

మండలంలోని దుండ్రపల్లి, బోయినపల్లి, మల్కాపూర్, జగ్గారావుపల్లి, కొత్తపేట, రామన్నపేట, రత్నంపేట, మాన్వాడ, వెంకట్రావుపల్లి, మల్లాపూర్, మర్లపేట గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. అయితే గతంలో నిర్మించిన భవనాలు సింగిల్ గదితో ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. రత్నంపేట, మాన్వాడ, మల్కాపూర్ తదితర గ్రామాల్లో ఒక గది, వరండాతో చాలా ఏళ్ల కింద భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఈ పంచాయతీ భవనాలను కూల్చి వేస్తేనే కొత్త భవన నిర్మాణాలు మొదలు పెట్టే అవకాశం ఉంది. అయితే పలు గ్రామాల్లో ఇప్పటికీ పంచాయతీ భవనాలు కూల్చి వేసే పనులు మొదలు కాలేదు.

స్థల కొరత

గతంలో ఏళ్ల కింద నిర్మించిన భవనాలు గుంట, అర గుంట స్థలంలో నిర్మించారు. మారిన పరిస్థితులు, గ్రామ జనాభా, పాలకవర్గ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా కొత్త జీపీ భవనాలు నిర్మించాలంటే పాత భవనాలు ఉన్న పరిసరాల్లో స్థలం లేదు. దీంతో బోయినపల్లి, మర్లపేట, రామన్నపేట, మల్లాపూర్ గ్రామాల్లో ఇపుడు ఉన్న భవనం స్థానంలో కాకుండా కొత్త ప్రదేశంలో నిర్మించేందుకు స్థలం గుర్తించాలని పీఆర్ ఏఈ పవనకుమారి తెలిపారు. పంచాయతీ భవనాల నూతన నిర్మాణాలకు స్థల కొరత వేధిస్తోంది. వెంకట్రావుపల్లి, దుండ్రపల్లి, కొత్తపేట గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు స్థల కొరత ఇబ్బందిగా మారిందని ఆయా గ్రామాల సర్పంచులంటున్నారు.

ఈజీఎస్ పనుల బిల్లుల మంజూరుపై ఆందోళన

మండలంలో పాత గ్రామపంచాయతీ భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలని కోరుతున్న సర్పంచులు, ఈజీఎస్ కింద మాత్రం నిర్మించేందు ఆసక్తి చూపడం లేదు. ఈజీఎస్ నిధులతో లేబర్, మెటీరియల్ కాంపోనెంట్ ఇబ్బందులు ఉంటాయని అంటున్నారు. పనులు పూర్తి చేసిన తరువాత బిల్లుల కోసం ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వస్తుందని పలువురు సర్పంచులు అంటున్నారు. గతంలో గ్రామాల్లో చేసిన శ్మశానవాటికలు, పల్లె ప్రకృతివనాలు తదితర అభివృద్ధి పనులకు నేటికి బిల్లులు రాలేదని, ఇపుడు ఈజీఎస్ నిధులతో జీపీ భవనాలు నిర్మిస్తే బిల్లులను మరచిపోవాలంటున్నారు. జీపీ భవనాల నిర్మాణాలు ప్రారంభం కాకపోవడానికి అసలు కారణం బిల్లులు రాకపోవడమేనని తెలుస్తోంది.

బిల్లులు రాలేదు


గతంలో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేశాం. వాటికి సంబంధించిన బిల్లులు పూర్తిగా రాలేదు. ఈక్రమంలో మళ్లీ జీపీ భవనం నిర్మాణం ప్రారంభించాలంటే భయం అవుతోంది. ఇపుడు ఉన్న భవనం కూల్చేసి కొత్త భవనం నిర్మించాలి. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు త్వరగారాకపోతె ఎవరికి చెప్పుకోవాలి.

– రామిడి శ్రీనివాస్. సర్పంచ్, మాన్వాడ

ఐదు గుంటల స్థలం కావాలి


గ్రామంలో సుమారు 30 ఏళ్ల కింద నిర్మించిన ఒక గదితో కూడిన చిన్న భవనం ఉంది. ఆ భవనాన్ని అపుడు ఓ గుంట స్థలంలో నిర్మించారు. ఇపుడు కొత్త భవనం నిర్మించాలంటే కనీసం ఐదు గుంటల స్థలం కావాలి. గ్రామ కంఠంలో ఐదు గుంటల ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ గుర్తిస్తే గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పనులు ప్రారంభిస్తాం.

– కందుల కరుణ, సర్పంచు, దుండ్రపల్లి

స్థలం కేటాయించాలి


మా గ్రామపంచాయతీ భవనం కూలిపోయే విధంగా ఉంది. దీంతో ఏడాదిగా అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నాం. కొత్త భవన నిర్మాణానికి స్థలం లేదు. వరద కాల్వ పరిసరాల్లో ఇరిగేషన్ ఆధీనంలో ఉన్న స్థలం కేటాయిస్తే భవన నిర్మాణానికి అనువుగా ఉంటుంది. ఈ విషయంలో తహసీల్దార్‌కు విన్నవించాం. అలాగే ఒక దాతను సంప్రదిస్తున్నాం.

– బూర్గుల నందయ్య, సర్పంచు, వెంకట్రావుపల్లి

ప్రారంభించేలా చూస్తాం


మండలంలో 11 గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు ఈజీఎస్ నిధులు రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఐదు గ్రామాల్లో స్థలం ఉందన్నారు. కొన్ని గ్రామపంచాయతీలు స్థలం లేదని చెబుతున్నారు. నిధులు మంజూరైన గ్రామాల్లో పనులు ప్రారంభించాలని చెబుతున్నాము. త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చూస్తాము.

– పవనకుమారి, ఇన్‌చార్జి పీఆర్, ఏఈ

క్లుప్తంగా

రాష్ట్ర ఏర్పాటుతోనే గ్రామాల అభివృద్ధి


జీపీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట: రాష్ట్రం ఏర్పాటై కేసీఆర్ సీఎం అయిన తరువాతే గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని రంగంపేట గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం అదే గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను సర్వే చేయించి పరిహారం అందించడంతో పాటు, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సర్పంచ్ వజ్రవ్వ, సోమారంపేట సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గౌడుగు తిరుపతి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎంద్ర చందన్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మగుడి నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండల కేంద్రంలో నిర్మించే రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోకల రేఖ, గౌడ సంఘం నాయకులు నేరెళ్ల నారాయణగౌడ్, అబ్బసాని శంకర్‌గౌడ్, నేరెళ్ల లింబయ్య, సత్యం , వైకుంఠం, అబ్బసాని రాములు, బిక్షపతి, నారాయణ, ఏగొల్లపు రవి, నారాయణ, మల్లేశం పాల్గొన్నారు.

జేపీఎస్‌లపై సర్కారు చిన్నచూపు



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: జూనియర్ పంచాయితీ కార్యదర్శులపై సర్కారు చిన్నచూపు వహిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో ఆయన మాట్లాడారు. జీపీఎస్‌ల నాలుగేళ్ల ప్రొహిబెషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణిస్తూ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయితీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. వారి సమస్యల పరిష్కారం వరకు పార్టీ వెన్నంటి పోరాడుతుందన్నారు. సమావేశంలో నాయకులు జంగం అంజయ్య, సావనపల్లి మల్లేశం, కదారి రాములు, వడ్డేపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె..


ముస్తాబాద్‌లో కార్యదర్శుల సమ్మె


ఎల్లారెడ్డిపేటలో..


వీర్నపల్లిలో..

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/ముస్తాబాద్/కోనరావుపేట: జూనియర్ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఉద్యోగాలు క్రమ బద్ధీకరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం ఆరో రోజుకు చేరుకుంది. ఎల్లారెడ్డిపేటలో సమ్మె చేస్తున్న కార్యదర్శులకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుండాడి వెంకట్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. వీరి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. వీర్నపల్లిలో జూనియర్ కార్యదర్శుల మండల అధ్యక్షుడు బానోత్ రాజు, జూనియర్ కార్యదర్శులు పాల్గొన్నారు. ముస్తాబాద్‌లో జూనియర్ కార్యదర్శుల సమ్మెకు గూడూరు సర్పంచ్ బీఎస్పీ నాయకుడు చాకలి రమేశ్ సంఘీభావం ప్రకటించారు. నాలుగేళ్లుగా గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములైన జూనియర్ కార్యదర్శుల డిమాండ్లను ప్రభుత్వం నేరవేర్చాలన్నారు. పోటీ పరీక్షలు రాసి, రెండేళ్లకే క్రమబద్ధీకరణ కావాల్సిన జూనియర్‌లను ప్రభుత్వం చిన్నచూపు చూడవద్దన్నారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బీఎస్పీ మండల కమిటీ అధ్యక్షుడు నవీన్, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

పెద్ద చెరువును పట్టించుకుంటాం

- మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలించిన ఈఈ అమరేందర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్


పెద్ద చెరువు తూమును పరిశీలిస్తున్న ఈఈ అమరేందర్‌రెడ్డి, డీఈఈ రవీందర్

ముస్తాబాద్: ముస్తాబాద్ పెద్ద చెరువును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఈఈ అమరేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధిపై సాక్షిలో ×అటకెక్కిన సుందరీకరణ₹ శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఈఈ, డీఈఈలు క్షేత్రస్థాయిలో పెద్ద చెరువును బుధవారం సందర్శించారు. చెరువు తూము నుంచి లీకేజీలను అరికట్టేందుకు గ్రౌటింగ్ చేస్తామని ఈఈ పేర్కొన్నారు. సుందరీకరణ, పిల్లల పార్క్ కోసం రెండు ఎకరాల నీటిపారుదలశాఖ భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే సుందరీకరణ కోసం కొన్ని పనులు చేశామని, పూల మొక్కలు, లైట్లు, గ్రీనరీ పనులను టూరిజం శాఖ ద్వారా చేపట్టేందుకు ప్రతిపాదనలు చేస్తామన్నారు. మత్తడి వద్ద లీకేజీల మరమ్మతు చేపడుతామన్నారు. సిద్దిపేట కోమటి చెరువులా ముస్తాబాద్ పెద్ద చెరువును అభివృద్ధి చేయవచ్చని మాజీ సర్పంచులు వివరించారు. 700 ఎకరాలకు ఆయకట్టు గల ఈ చెరువు కెనాల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. త్వరలోనే కలెక్టర్‌కు దీనిపై నివేదిక ఇస్తామని ఈఈ తెలిపారు. ఆయన వెంట డీఈ రవీందర్, ఏఈ వంశీకృష్ణ, మాజీ సర్పంచులు తిరుపతి, రమణరెడ్డి, వార్డు సభ్యుడు బుర్ర రాములు, వర్క్ఇన్‌స్పెక్టర్ రాజు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులు

చందుర్తి: జూనియర్ కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో మండలంలోని 16 పంచాయతీలకు ఇన్‌చార్జీలుగా మండల పరిషత్ సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మండలంలోని 19 జీపీలకు మూడు గ్రామాలకు రెగ్యులర్ కార్యదర్శులు ఉండగా.. 16 జీపీలకు జేపీఎస్, ఓపీఎస్‌లు ఉన్నారు. వీరంతా సమ్మెలో ఉండడంతో మండల పరిషత్ సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. నర్సింగాపూర్, అనంతపల్లి, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లె గ్రామాలకు వి.కళాజ్యోతి, బండపల్లి, ఎన్గల్, మూడపల్లి గ్రామాలకు అభిలాశ్, చందుర్తి, మూడపల్లి, రామన్నపేటలకు శ్రీనివాస్‌రెడ్డి. దేవునితండా, లింగంపేట, సనుగులకు సూపరింటెండెంట్ సురేందర్‌కు, జోగాపూర్, కిష్టంపేట, రామరావుపల్లెలకు మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ఉపేందర్‌కు, కొత్తపేట, కట్టలింగంపేట, మల్యాల గ్రామాలకు మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ రమాదేవికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వివరించారు.

కల్యాణం కమనీయం


కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

కోనరావుపేట: మండలం నాగారంలో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ అనంతరం కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తెచ్చి కల్యాణాన్ని జరిపించారు. ఈ వేడుకలకు మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్, సర్పంచ్ బాస లావణ్య, గోపాడి సురేందర్‌రావు, మాజీ సర్పంచ్ భూమయ్య పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో శ్రీగంగమ్మ దేవత ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. శ్రీగంగాదేవి పరమేశ్వరుల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శాంతి పౌష్టిక హోమాలు కళాన్యాస హోమాలు అనంతరం యంత్ర విగ్రహ ధ్వజస్తంభ, శిఖర, ప్రాణ ప్రతిష్ఠలను వేద పండితులు నిర్వహించారు. గంగమ్మ బోనాలతో మహిళలు అమ్మవారి ఆలయానికి వెళ్లి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ గౌతంరావు, ఉపసర్పంచ్ మంజుల, ఎంపీటీసీ బాలకిషన్, గంగపుత్ర సంఘం బాధ్యులు మల్లయ్య, జగన్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.


ముస్తాబాద్: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెద్దమ్మ పెద్దిరాజుల

గంభీరావుపేట: మండలంలోని నర్మాలలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఎంపీపీ వంగ కరుణ వేడుకల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం సంఘ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాలు

గంభీరావుపేట: మండలంలోని నాగంపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం పుణ్యహవచనం, స్థాపిత దేవతాపూజ, అంకురార్పణ, ధ్వజప్రతిష్ఠాపన, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఎంపీటీసీ నాగభూషణం, మాజీ సర్పంచ్ ఎల్లం పాల్గొన్నారు. గురువారం స్వామివారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆలయ వార్షికోత్సవం


హోమం చేస్తున్న పండితులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో బుధవారం ఆలయ 65వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం, పూర్ణాహుతి, కలశస్థాపన, కుంకుమ పూజ, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు ఉమాశంకర్‌శర్మ, సేవా సంఘం అధ్యక్షుడు వనం బొందయ్య, ఉపాధ్యక్షుడు గాజుల దేవదాస్, సభ్యులు పోతు అంజనేయులు, వనం ఎల్లయ్య, శ్రీరాం సుదర్శన్, సత్యానారాయణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వనం రమేశ్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరంకు చెందిన నేగూరి నాగరాజు (35) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ పోషణ భారం, భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడికి భార్య నవ్య, కుమారుడు ఉన్నారు. వేములవాడ టౌన్ ఎస్సై వెంకట్రాజం పరిశీలించి కేసు నమోదు చేశారు.

మొబైల్ అప్పగించిన పోలీసులు

వేములవాడ: వేములవాడలోని భగవంతరావునగర్‌కు చెందిన సుజాత తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. పోలీసులను ఆశ్రయించడంతో స్పందించిన పోలీసులు వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను కనుగొని.. సుజాతకు సీఐ వెంకటేశ్ అప్పగించారు. ఎస్సై వెంకట్రాజం ఉన్నారు.

లైసెన్స్ రివాల్వర్లపై ఆరా?

వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలో లైసెన్స్ పొందిన రివాల్వర్లపై పోలీసులు బుధవారం ఆరా తీశారు. లైసెన్స్ పొందిన వారి జాబితా, రివాల్వర్ మోడల్, బుల్లెట్లు ఎన్ని ఉన్నాయో స్టేషన్‌కు తీసుకొచ్చి చూపించాలని పోలీసులు ఆదేశిస్తున్నారు. గురు లేదా శుక్రవారం పూర్తి వివరాలు తెలియజేయాలంటూ పోలీసులు లైసెన్స్ ఉన్న వ్యక్తులకు కోరుతున్నారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా లైసెన్స్ రివాల్వర్లపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

వేములవాడ రూరల్: వేములవాడ మండలంలోని మల్లారం నుంచి మర్రిపల్లికి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇసుక తరలింపునకు అధికారులు అనుమతి ఇవ్వడంతో ఇసుక క్వారీ పేరుతో ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులతో కొంతమంది ఇసుక తరలిస్తున్నారు. మరికొందరు అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

సమాచారం

నేడు లక్ష్మీనరసింహుని కల్యాణం

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం ఉదయం 10.20 గంటలకు శ్రీ భూనీలా సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భగవద్గీత పారాయణ శిక్షణ

సిరిసిల్లకల్చరల్: త్రిదండి చినజీయర్ స్వామి ఆశీస్సులతో వికాస తరంగిణి జిల్లా శాఖ సారథ్యంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పారాయణం, భజనలు, సమాచార విలువలతో కూడిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. రాళ్లబావి సమీపంలోని శ్రీకృష్ణమందిరంలో ప్రారంభమైన శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆసక్తి గల విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగే తరగతులకు హాజరు కావచ్చునని సంస్థ సమన్వయకర్తలు తెలిపారు.

సర్పంచ్‌కు షోకాజు నోటీసు..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మారుపాక గ్రామ సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభకు జిల్లా పంచాయతీ అధికారి షోకాజు నోటీసు జారీ చేశారు. గ్రామంలోని చెరువులో పూడిక మట్టిని విక్రయించి దుర్వినియోగానికి పాల్పడినట్లు వార్డు సభ్యులతో పాటు పలువురు అధికారులకు ఫిర్యాదు చేయడంతో షోకాజు నోటీసు జారీ చేశారు. అలాగే జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని భూగర్భశాఖ, నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించి నివేదిక అందజేయాలని నోటీసులో పేర్కొన్నారు.

కొనుగోళ్లపై చర్చకు సిద్ధమా?


మాట్లాడుతున్న చైర్మన్ బాపురావు

ముస్తాబాద్: ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ నాయకులు చర్చకు రావాలని పోతుగల్ సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు సవాల్ విసిరారు. పోతుగల్ సింగిల్‌విండో ప్రధాన కార్యాలయంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. పోతుగల్, ఆవునూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ నాయకులు చేసిన ధర్నా కేవలం ఉనికిని చాటుకోవడం కోసమేనన్నారు. పోతుగల్ సింగిల్‌విండో పరిధిలో జిల్లాలో అత్యధికంగా ఇప్పటి వరకు 11వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించామన్నారు. టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలను ఏఎంసీ చేస్తుందన్నారు. గతంలో సింగిల్‌విండో చైర్మన్‌గా పనిచేసిన చక్రధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు రైతులను పట్టించుకోవడం లేదంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అనుక్షణం రైతుల కోసం పనిచేసే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు. మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి నీది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్‌చైర్మన్ మేరుగు రాజేశంగౌడ్, డైరెక్టర్లు ఉన్నారు.

కంటివెలుగులో 3,757 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో బుధవారం కంటి వెలుగు–2లో జిల్లా వ్యాప్తంగా 3,757 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 628 మందికి రీడింగ్ కంటి అద్దాలను, 449 మందికి పాయింట్ కంటి అద్దాలను పంపిణీ చేశారు. 67వ రోజు కంటి వెలుగు శిబిరాలు 26 ప్రాంతాల్లో నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాలో 2,49,314 మందికి పరీక్షలు నిర్వహించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సర్పంచ్ కొత్తపల్లి వాణి పంపిణీ చేశారు.

పరామర్శ

బోయినపల్లి: మండలంలోని నీలోజిపల్లి గ్రామ ఉపసర్పంచ్ చెంచు నాగరాజును బుధవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల నాగరాజు తండ్రి నారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి దంపతులు రూ.20,116 విరాళం అందజేశారు.